జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com





# శ్రీముఖలింగం.. భక్తజనసంద్రం

* నేత్రపర్వం.. చక్రతీర్థ స్నాన ఘట్టం
* నందివాహనంపై పార్వతీపరమేశ్వరుల ఊరేగింపు
* శివనామస్మరణతో మార్మోగిన వంశధార నదీతీరం
* వేలాదిగా తరలివచ్చిన భక్తజనం
* పోలీసుల కనుసన్నల్లోనే ఉత్సవం
* కట్టుదిట్టమైన బందోబస్తు
* దగ్గరుండి పర్యవేక్షించిన ఎస్పీ

**జలుమూరు, ఫిబ్రవరి 18 (వార్త):** శ్రీముఖలింగం.. భక్తజన సంద్రంతో తడిసిముద్దయింది. శివనామస్మరణతో మార్మోగింది. శ్రీముఖలింగేశ్వరస్వామి చక్రతీర్థ స్నానానికి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. మహాశివరాత్రి ఉత్సవాలు ముగింపు రోజు బుధవారం అర్చకులు పార్వతీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఉత్సవమూర్తులకు నూతనవస్త్రాలు ధరించి పూలమాలలతో అలంకరించారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ అర్చకులు బయటకు తెచ్చి నంది వాహనంపై శ్రీముఖలింగం ఆలయం నుంచి వంశధార నదిలోని మిరియాపల్లి రేవుకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. సంప్రదాయం ప్రకారం మిరియాపల్లి గ్రామస్థులు స్వామి వారిని ఆహ్వానం పలికి పూజలు చేశారు. ఆ తర్వాత పార్వతీ పరమేశ్వరులకు వంశధారనదిలో చక్రతీర్థ స్నానాలు చేయించారు. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి డ్రోన్, సీసీ కెమెరాలతో కంట్రోల్‌రూమ్ నుంచి పర్యవేక్షించారు. రోప్‌వే బృందాలు ముందు నడవగా ఉత్సవమూర్తులను వంశధార నదిలోకి చక్రతీర్థ స్నానాలకు ఊరేగింపుగా తీసుకువెళ్లారు. ఎక్కడా తోపులాట జరగకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. సుమారు 1000 మంది పోలీసు సిబ్బందితో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. స్పెషల్ పార్టీ, సివిల్ పోలీసులు,రోప్ పార్టీలు, రిజర్వ్ పార్టీలు, హోంగార్డు,ఎస్డీఆర్ఎఫ్ బృందాలు విధుల్లో పాల్గొన్నాయి. పార్వతీ పరమేశ్వర స్వామివారి నంది వాహనం ఆలయం నుండి వంశధార నదిలో మిరియాపల్లి రేవుకు వెళ్లే సుమారు రెండు కిలోమీటర్ల మార్గంలో పటిష్టమైన రోప్ పార్టీల సహకారంతో, భక్తులు రద్దీని నియంత్రించారు. నదిలో భక్తుల రద్దీని అరికట్టే దిశగా స్వామి వారు పుణ్యస్నానాల కోసం నాలుగు వరుసల బారికేడ్లు ఏర్పాటు చేసి, ప్రత్యేక విభజన ఏర్పాట్లు చేసి, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక మార్గదర్శకాలు అమలు చేసి, భక్తులు సురక్షితంగా తిరిగి వెళ్లేలా చర్యలు చేపట్టారు. చక్రతీర్థ స్నానాలు విజయవంతంగా, ప్రశాంతంగా నిర్వహించడంలో భాగస్వామ్యులైన అదనపు ఎస్పీలు కె.వి. రమణ, పి. శ్రీనివాసరావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది కృషి అభినందనీయం అని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.

## చక్రతీర్థ స్నానాలు విజయవంతం:ఈవో

శ్రీముఖలింగేశ్వర స్వామి చక్రతీర్థ స్నానాలు విజయవంతమయ్యాయని దేవస్థానం ఈఓ ఏడుకొండలు తెలిపారు. శివరాత్రి ఉత్సవాల ప్రారంభం నుంచి చక్రతీర్థాల ముగింపు వరకు జిల్లా కలెక్టర్ ఆదేశాలను తూచా తప్పకుండా అమలు చేశామని పేర్కొన్నారు. పోలీసు, రెవెన్యూ, దేవాదాయ శాఖలు సమన్వయంతో పనిచేశాయన్నారు.











## ప్రతి రైతుకూ 14 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్య



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 18 (వార్త):** ప్రభుత్వం అమలు చేస్తున్న సాగు పథకాల్లో పారదర్శకత కోసం ప్రతి రైతుకూ 14 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్య (ఫార్మర్ రిజిస్ట్రీ ఐడీ) తప్పనిసరి అని జిల్లా వ్యవసాయ అధికారి కోరాడ త్రినాథ స్వామి తెలిపారు. పి.ఎం. కిసాన్ నిధులు, ఎరువుల రాయితీలు, పంట బీమా, బ్యాంకు రుణాలు వంటి ప్రయోజనాలు నేరుగా పొందేందుకు ఈ గుర్తింపు సంఖ్య ఎంతో దోహదపడుతుందని ఆయన వివరించారు. జిల్లాలో ఇప్పటివరకు 2,74,859 మంది రైతులు తమ వివరాలను నమోదు చేసుకున్నారని, మిగిలిన వారందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. రైతులు తమ భూమి పాసు పుస్తకం, ఆధార్ కార్డు, ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ ఫోన్‌తో సమీపంలోని రైతు సేవా కేంద్రం, గ్రామ సచివాలయం లేదా మీ–సేవ కేంద్రాలను సంప్రదించి నమోదు చేసుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 28వ తేదీ లోపు ఈ ప్రక్రియను పూర్తి చేయాలని, గడువు ముగిసిన తర్వాత సాంకేతిక ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున రైతులందరూ తక్షణమే స్పందించి తమ 14 అంకెల విశిష్ట సంఖ్యను పొందాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఎంజీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం


**పాతపట్నం, ఫిబ్రవరి 18(వార్త):** మహేంద్రతనయ నదిపై పాతపట్నం నుండి కాపు గోపాలపురం, హెచ్ గోపాలపురం గ్రామాలను కలుపుతూ వంతెన నిర్మించాలని అసెంబ్లీ వేదికగా పాతపట్నం శాసనసభ్యులు మామిడి గోవిందరావు గళమెత్తారు. దీంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. అనేక ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ ప్రధాన సమస్యను శాసనసభ దృష్టికి తీసుకువెళ్లి, వంతెన నిర్మాణ ఆవశ్యకతను బలంగా వినిపించినందుకు కృతజ్ఞతగా కాపు గోపాలపురం, హెచ్ గోపాలపురం గ్రామ ప్రజలు ఎమ్మెల్యే ఎంజీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం గ్రామస్థులు మాట్లాడుతూ, వర్షాకాలంలో మహేంద్రతనయ నది ఉధృతంగా ప్రవహించే సమయంలో రాకపోకలు సాగించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. తమ కష్టాలను గుర్తించి మామిడి గోవిందరావు అసెంబ్లీలో ప్రస్తావించడం తమకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు వంతెన నిర్మాణంతో రెండు గ్రామాల ప్రజల కల నెరవేరుతుందని, తమ ప్రాంత అభివృద్ధికి ఎమ్మెల్యే చూపిస్తున్న చొరవ అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో భారీ సంఖ్యలో గ్రామ పెద్దలు, మహిళలు, యువత పాల్గొని మామిడి గోవిందరావు జై.. అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి టౌన్ పార్టీ అధ్యక్షుడు సైలాడ సతీష్, నీలమణి దుర్గ అమ్మవారి గుడి చైర్మన్ అక్కంద్ర సన్యాసిరావు, కళింగ కోమటి డైరెక్టర్ శాసనపురి మధుబాబు, రఘుబాబు, రుంకు చలపతిరావు, ప్రశాంత్ కుమార్ పాడి, తడక లోకేష్, శాసనపురి వెంకటరమణ, బమ్మిడి రమణయ్య, తడక హరి, కరకవలస మన్మధరావు, వార్డ్ మెంబర్ దుర్గారావు, ఊర్జాన నారాయణరావు, కనకల సింహాద్రి, దుమ్మల నారాయణమ్మ, చింతకాయల రాజారావు, దాసర వెంకటరమణ, గోకవలస ఉగాది, గుమ్మడి అప్పారావు, అక్కంద్ర ఎర్రయ్య, సంజీవ్ రాందాస్, డోలా కుమార్, మద్దిలి సంతోష్, నల్లి సాయి, యర్లంకి సంతోష్, కమకట్ల ఖగేష్, గోకవలస కిషోర్, నిసాని శ్రీనివాసరావు, ఎండు వెంకట్రావు, రేగటి నందిని, సంజీవ్ మోహిని, గొడబ హరి, బూసి వేణుగోపాలరావు, రాము పాల్గొన్నారు..




## ఆక్స్‌ఫర్డ్, ఎల్ఎస్ఈల్లో శ్రీకాకుళం యువకుడికి చోటు

*ప్రపంచ స్థాయి వర్సిటీల నుంచి అరుదైన ఆహ్వానం *'అభి చంద్ర కార్తీక్' అరుదైన ఘనత

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 18 (వార్త):** జిల్లా యువత మేధస్సు ప్రపంచ స్థాయిలో మరోసారి మెరిసింది. ప్రతిష్ఠాత్మకమైన ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంతో పాటు లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో ఒకేసారి ప్రవేశం సాధించి అభిచంద్ర కార్తీక్ నూర్తి చరిత్ర సృష్టించారు. జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త (డిసిహెచ్ఎస్) నూర్తి కళ్యాణ్ బాబు కుమారుడు అభిచంద్రకు ప్రపంచంలోనే అత్యంత పురాతనమైన ఆక్స్‌ఫర్డ్ వర్సిటీలో 'ఎంఫిల్ డెవలప్‌మెంట్ స్టడీస్ (ఎకనామిక్స్)' చదివేందుకు ఆయనకు అవకాశం లభించింది. మన జిల్లా నుంచి కింగ్స్ కాలేజ్ లండన్, ఎల్ఎస్ఈ, ఆక్స్‌ఫర్డ్ వంటి మూడు అత్యున్నత విశ్వవిద్యాలయాలకు ఎంపికైన తొలి వ్యక్తిగా ఆయన రికార్డు నెలకొల్పారు. స్థానిక సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో విద్యాభ్యాసం చేసిన అభి, చిన్నప్పటి నుంచే చదువులో చురుగ్గా ఉండేవారు.



నేషనల్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్ స్కాలర్‌గా తన మేధస్సును నిరూపించుకున్నారు. లండన్‌లోని కింగ్స్ కాలేజీలో ఫిలాసఫీ, పాలిటిక్స్ అండ్ ఎకనామిక్స్ విభాగంలో ఫస్ట్ క్లాస్‌లో పట్టా పొందారు. అనంతర కాలంలో కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం, కింగ్స్ కాలేజ్ లండన్ సంయుక్తంగా నిర్వహించిన 'ఎంగెల్స్‌బర్గ్ అప్లైడ్ హిస్టరీ ఫెలోషిప్' కు కూడా ఆయన ఎంపికయ్యారు. విద్యతో పాటు సామాజిక అంశాల్లో తనదైన ముద్ర వేసిన అభి చంద్ర కార్తీక్, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్ మోహన్ నాయుడు వద్ద 'పాలిటిక్స్ ఫర్ ఇంపాక్ట్' ఇంటర్న్‌గా కూడా పనిచేశారు. జిల్లాకు చెందిన యువకుడు సాధించిన ఈ అంతర్జాతీయ విజయంపై జిల్లావ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

## వంశధార ఆధునీకరణపై ప్రభుత్వం దృష్టి సారించాలి

అసెంబ్లీలో గళమెత్తిన ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



**నరసన్నపేట, ఫిబ్రవరి 18(వార్త):** రైతులకు కల్పవల్లిగా నిలిచిన వంశధార కాలువ ఆధునీకరణ పనులను ప్రభుత్వం అత్యవసరంగా చేపట్టాలని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కోరారు. బుధవారం అసెంబ్లీలో జీరో అవర్ సందర్భంగా మాట్లాడుతూ ఆయన ఈ విషయాన్ని ప్రస్తావించారు. వంశధార ఎడమ కాలువ ద్వారా నరసన్నపేట నియోజకవర్గంలోని సుమారు 67 వేల ఎకరాలకు సాగునీరు అందుతోందని తెలిపారు. అంతేకాకుండా టెక్కలి, పలాస ప్రాంతాలకూ ఈ కాలువ ద్వారా సాగునీరు సరఫరా అవుతోందని పేర్కొన్నారు. వేలాది మంది రైతులు ఈ నీటిపై ఆధారపడి వ్యవసాయం సాగిస్తున్నారని చెప్పారు. గతంలో కాలువ ఆధునీకరణ పనులకు శ్రీకారం చుట్టినప్పటికీ ప్రభుత్వం మారడంతో ఆ పనులు నిలిచిపోయాయని విమర్శించారు. సాగునీటి సరఫరా సమర్థవంతంగా కొనసాగాలంటే కాలువ మరమ్మతులు, ఆధునీకరణ అత్యవసరమని ఆయన స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి విజ్ఞప్తి చేశారు.

## విద్యార్థులకు వినూత్న బోధన అందించండి



**నరసన్నపేట, ఫిబ్రవరి 18(వార్త):** నరసన్నపేట మండల విద్యాశాఖ అధికారి ఉప్పాడ శాంతారావు బుధవారం తామరపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా పరిశీలించారు. పాఠశాలలో నిర్వహిస్తున్న స్టడీ అవర్స్‌ను సమీక్షించి విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు అడిగి వారి అవగాహన స్థాయిని తెలుసుకున్నారు. సమాధానాలను పరిశీలిస్తూ బోధన విధానంలో మెరుగుదల అవసరమని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల మెరుగైన అభ్యాసన కోసం ఉపాధ్యాయులు వినూత్న పద్ధతుల్లో బోధన అందించాలని సూచించారు. అలాగే పాఠశాల రికార్డులు, విద్యార్థుల వాచకాలు, నోట్లు పరిశీలించి నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. విద్యా ప్రమాణాలు పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఆయన పేర్కొన్నారు. పాఠశాలలో శైక్షణిక వాతావరణాన్ని మరింత బలోపేతం చేసి విద్యార్థుల ప్రతిభను వెలికితీయాలని ఎంఈఓ ఉప్పాడ శాంతారావు సూచించారు.

## అధికారుల వేధింపులపై మున్సిపల్ కార్మికుల నిరసన



**పలాస, ఫిబ్రవరి 18 (వార్త):** గత రెండు రోజులుగా మున్సిపాలిటీలో పని చేస్తున్న శానిటేషన్ కార్మికులను కమిషనర్ శ్రీనివాసులు, ఇనస్పెక్టర్ శేఖర్‌లు వేదిస్తున్నారని శానిటేషన్ కార్మికులు తెలిపారు. బుధవారం మస్టర్ పాయింట్ వద్ద వేధింపులు ఆపాలని కోరుతూ కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి యన్ గణపతి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సీహెచ్ మురగన్, బి.కుర్మారావు, కె.ఈశ్వరరావులు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల పీయఫ్ డబ్బులు 2011–12లో 20 నెలలకు సంబంధించిన 33 లక్షల 53 వేలు రూపాయలు కార్మికుల ఖాతాలలో జమ చేయకుండా 15 సంవత్సరాలనుండి కాలయాపన చేస్తున్నారు. అధికారులు పది నిమిషాలు లేటుగా వచ్చినందుకు పనిషమెంట్‌గా డ్యూటీలు వేయడం తగదన్నారు. కనీసం పారలు, టబ్బులు, వంటి పనిముట్లు కూడా ఇవ్వకుండా, సరిపడా వర్కర్లను కూడా నియమించడం లేదన్నారు. పద్దెనిమిది నెలలు కోవిడ్ సమయంలో పని చేసిన వారికి జీతాలు ఇవ్వకుండా గత నాలుగు సంవత్సరాలుగా ఎగనామం పెట్టిన మున్సిపల్ అధికారులు వారి ఇగో కోసం కార్మికులను బలి చేయడం ఏమిటని ప్రశ్నించారు. చనిపోయిన, రిటైర్ అయిన వారి కుటుంబాల పిల్లలకు పని కల్పించాలని, నిబంధనలు ఉన్నా కూడా పనిలోకి తీసుకోకుండా ఉన్న అధికారులు మీరు సకాలంలో టైమ్ ప్రకారం పని చేస్తున్నారా అని ప్రశ్నించారు. నిరసనలో యస్ రమేష్, యస్ శంకర్, ప్రకాష్ ముఖి, యం రవి గులాబీ, శకుంతల, అమర్, తిరుపతి, బాలకృష్ణ తదితర కార్మికులు పాల్గొన్నారు.

## శిథిలావస్థలో ఉమా త్రైలోకేశ్వర స్వామి ఆలయం



**సారవకోట, ఫిబ్రవరి 18(వార్త):** మండల కేంద్రం సారవకోట ప్రధాన హైవే సమీపంలో ఉన్న చారిత్రక ప్రాధాన్యం గల ఉమా త్రైలోకేశ్వర స్వామి ఆలయం శిథిలావస్థకు చేరుకుంది. ఈ ఆలయం పర్లాకిమిడి గజపతి రాజుల కాలంలో నిర్మించబడిందని గ్రామస్థులు చెబుతున్నారు. ప్రస్తుతం ఆలయ భూములు దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఉన్నాయి. ఆలయంపై కప్పులు పెచ్చులుగా ఊడిపడుతున్నాయని, వర్షాకాలంలో మరింత ప్రమాదకర పరిస్థితులు నెలకొనే అవకాశముందని స్థానిక భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దేవాలయ చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకుని తక్షణమే మరమ్మతులు చేపట్టి ఆలయాన్ని సంరక్షించాలని భక్తులు కోరుతున్నారు.

# సముద్రంలో మునిగిన బోటు

*ఐక్యతగా బయటకు లాగిన మత్స్యకారులు *వారి కష్టంలో మేము సైతం అంటూ వైసీపీ నేతలు



**సోంపేట ఫిబ్రవరి 18(వార్త):** ఇసకలపాలెం మత్స్యకారులు సవడాల డిల్లేసు, బైపల్లి కామరాజు లకు చెందిన 18 లక్షలు విలువైన బోటు బుధవారం ఉదయం సముద్రంలో మునిగి పోయింది. రాత్రి బోటును లంగరు వేశారు. వేకువజామున వేటకు వెళదామని చూస్తే ఉంచిన చోట బోటు కనిపించలేదు. విషయం ఇతర బోటు యజమానులకు తెలిసి వారుకూడా తమ వేట మానుకొని సుమారు 50 బోట్లు, తెప్పలతో మునిగిపోయిన బోటును వెతుకులాట ప్రారంభించారు. ఎట్టకేలకు సదరు బోటు లంగరు వేసిన చోటునే మునిగిపోయినట్టు గమనించిచారు. గ్రామస్థులంతా కలిసి మునిగిపోయిన బోటును ఒడ్డుకు తీసుకురావడంలో సహకారం అందించారు. బోటు మునిగిపోయిన వార్త ఇసకలపాలెం ఎంపిటిసి తిరుపతి నుంచి సమాచారం అందగానే హుటాహుటిన ఇసకలపాలెం చేరుకున్న ఇచ్ఛాపురం నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త సాడి శ్యాంప్రసాద్ రెడ్డి, వైసిపి బి.సి విభాగం రాష్ట్ర కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్, సోంపేట జడ్.పి.టి.సి ప్రతినిధి తడక జోగారావులు సైతం అక్కడికి చేరుకున్నారు. మత్స్యకారులను కలసి బోటు మునిగిపోయిన తీరును, జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. వారు కూడా తలోచేయి వేసి బోటును బయటకు లాగేందుకు సహకరించారు. బోటు లైసెన్స్, నష్టపరిహారం అంశాల గూర్చి సాగరమిత్రను అడిగి తెలుసుకున్నారు. చేపలవేటనే జీవన భృతిగా కలిగిన ఆ రెండు మత్స్యకార కుటుంబాలకు భృతి కొరకు కొంత ఆర్థిక సహాయాన్ని అందించారు.

## జలుమూరు ఆదర్శ పాఠశాలకు ప్రింటర్ వితరణ



**జలుమూరు, ఫిబ్రవరి 18(వార్త):** జలుమూరు మోడల్ ఆదర్శ పాఠశాల హెడ్‌మాస్టర్ ఇప్పిలి మాధవరావు విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రింటర్‌ను అందజేశారు. పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన పాఠ్యపత్రాలు, దరఖాస్తులు, పరీక్షా పత్రాలు తదితర ప్రింట్లు తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో ఆయన స్వయంగా ప్రింటర్‌ను కొనుగోలు చేసి సమకూర్చారు.

## లుకలాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో క్విజ్ పోటీలు

**నరసన్నపేట, ఫిబ్రవరి 18(వార్త):** లుకలాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా సైన్స్ ఉపాధ్యాయుడు భాస్కరరావు వివిధ శాస్త్ర సంబంధిత అంశాలపై విద్యార్థులకు ప్రశ్నలు అడిగి వారి పరిజ్ఞానాన్ని పరీక్షించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సమాధానాలు ఇవ్వడంతో పోటీలు ఆసక్తికరంగా సాగాయి. విజేతలకు బహుమతులు అందజేసి ప్రోత్సహించారు. శాస్త్ర విజ్ఞానంపై ఆసక్తి పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్‌మాస్టర్, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## 20న నెహ్రూ యువ కేంద్రంలో జాబ్ మేళా

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 18 (వార్త):** నిరుద్యోగ యువతకు ఈనెల 20వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కె.సుధ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని 'మేరా యువ భారత్' (నెహ్రూ యువ కేంద్రం) వేదికగా ఉదయం 10 గంటలకు ఈ ఎంపికలు ప్రారంభం కానున్నాయి. ప్రముఖ సంస్థలైన టాటా క్యాపిటల్స్ లిమిటెడ్, ముత్తూట్ మైక్రో ఫిన్ లిమిటెడ్ ప్రతి నిధులు ఈ మేళాలో పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. టాటా క్యాపి టల్స్‌లో 60 లోన్ ఆఫీసర్ పోస్టులకు (జీతం రూ.25,000), ముత్తూట్ మైక్రో ఫిన్‌లో 25 రిలేషన్‌షిప్ ఆఫీసర్ పోస్టులకు (జీతం రూ. 16,000) నియామకాలు జరగ నున్నాయి. ఇంటర్ ఆపై విద్యార్హత ఉండి, 18 నుంచి 30 ఏళ్ల లోపు వయస్సు గల యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటా, విద్యా అర్హత ధ్రువపత్రాలు, ఆధార్ కార్డుతో హాజరు కావాలని, ముందుగా www.ncs.gov.in పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు.

## న్యాయసేవలను వినియోగించుకోండి



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 18 (వార్త):** బాలల భద్రత కోసం జాతీయ న్యాయ సేవాధికార సంస్థ అందిస్తున్న స్నేహపూర్వక న్యాయ సేవలను విద్యార్థులు వినియోగించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు సూచించారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ రోడ్డు లోని సన్‌షైన్ స్కూల్‌లో 8, 9 తరగతుల విద్యార్థులకు 'గుడ్ టచ్ – బ్యాడ్ టచ్'పై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బంధువులు, స్నేహితులు లేదా ప్రయాణాల్లో ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, శరీర భాగాలపై అనుచితంగా చేతులు వేసినా భయపడకుండా వెంటనే 'వద్దు' అని గట్టిగా చెప్పాలని హితవు పలికారు. ఇటువంటి చర్యలు చట్టరీత్యా నేరమని, వీటికి కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. ఆపదలో ఉన్నప్పుడు లేదా ఎవరైనా వేధింపులకు గురిచేసినప్పుడు విద్యార్థులు వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098, పోలీసు 112 లేదా ఉచిత న్యాయ సేవల నంబర్ 15100కు సమాచారం అందించాలని హరిబాబు సూచించారు. పిల్లలు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని, సమాజంలో గౌరవప్రదంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది జి. ఇందిరా ప్రసాద్, పాఠశాల ప్రిన్సిపల్ కె. ప్రదీప్, కో–ఆర్డినేటర్ కె. నీరజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



**ఆమదాలవలస, ఫిబ్రవరి 18 (వార్త):** చిలకపాలెం వాసి చిలక కరువోడు కుటుంబానికి రూ.2 లక్షలు సీఎంఆర్ఎఫ్ చెక్‌ను ఆమదాలవలస ఎమ్మెల్యే, రాష్ట్ర పబ్లిక్ అండర్‌టేకింగ్స్ కమిటీ (పియుసి) చైర్మన్ కూన రవికుమార్ బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా కూన రవికుమార్ మాట్లాడుతూ, పేద, మధ్యతరగతి కుటుంబాలకు అనారోగ్య సమయంలో ప్రభుత్వ సహాయ పథకాలు ఎంతో ఉపయోగంగా ఉంటాయని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా తమ వంతు కృషి కొనసాగిస్తామని హామీ ఇచ్చారు.


## పార్టీ బలోపేతానికి యువత నడుంబిగించాలి




**శ్రీకాకుళం, ఫిబ్రవరి 18 (వార్త):** భారతీయ జనతా యువ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమించబడిన తరువాత మొట్టమొదటిసారి శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయానికి విచ్చేసిన సందర్భంగా బూరె నరేంద్ర చక్రవర్తికి బీజేవైఎం పూర్వ జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జల రాజు వెంకట్, యువ నాయకులు పుష్పగుచ్ఛంతో ఘన స్వాగతం పలికారు. తొలుత భరతమాత చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం నరేంద్ర మాట్లాడుతూ పార్టీలో పెద్ద ఎత్తున యువత ఉన్నారని, వారంతా పార్టీ బలోపేతానికి నడుంబిగించాలన్నారు. కార్యకర్తలు, నాయకులకి అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు గజ్జల రాజు వెంకట్, జాడ అప్పలరాజు, ధనుష్ రంగా, జర్జాన రాంజీ, నాగరాజు, ఉమ, గోపి, తాతారావు, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

## కూర్మ గ్రామానికి విదేశీయులు

**జలుమూరు, ఫిబ్రవరి 18(వార్త):** జలుమూరు మండల శివారులోని కూర్మ గ్రామం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడుతోంది. హరినామ సంకీర్తన కార్యక్రమంలో పాల్గొనేందుకు నలుగురు విదేశీయులు బుధవారం ఉదయం కూర్మ గ్రామానికి చేరుకున్నారు. వారికి కూర్మ ప్రబోధకులు సాదర స్వాగతం పలికారు. గ్రామస్థులు, భక్తులతో కలిసి వారు హరినామ సంకీర్తనలో పాల్గొనడానికి సిద్ధమవుతున్నారు. ఈ నెల 19వ తేదీ గురువారం నరసన్నపేటలో నిర్వహించనున్న హరినామ సంకీర్తన కార్యక్రమంలో వీరితో పాటు విదేశీ మహిళలు కూడా పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక సందేశాలను ప్రపంచానికి చాటిచెప్పే వేదికగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు. అదే రోజు భగవద్గీతపై ప్రత్యేక ప్రసంగం కూడా నిర్వహించనున్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# టీచర్లకు జరిమానా నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 18 (వార్త):** పదవ తరగతి పరీక్షల మూల్యాంకనంలో విద్యార్థులకు వచ్చే మార్కుల తేడాకు విద్యాశాఖ ఎంచుకున్న జరిమానా విధానము సర్వీస్ పాయింట్ల కోత అనేవి సరైన మార్గం కాదని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు బల్లెడ రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి బుక్కూరు వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. పరీక్ష మూల్యాంకనంలో ప్రవేశపెట్టిన రెండంచెల, మాన్యుల్ డిజిటల్ విధానాన్ని స్వాగతించినప్పటికీ మూల్యాంకనను తక్కువ వ్యవధిలో పూర్తి చేయాలన్న ఒత్తిడిని విడనాడాలన్నారు. మూల్యాంకన కేంద్రాలలో వేసవికాలం దృష్టిలో ఉంచుకొని తగిన సదుపాయాలు కల్పించాలని కోరారు. రోజుకి 40 పేపర్లకు బదులుగా 30 పేపర్లు ఇవ్వాలని, మూల్యాంకనం రేట్లు కూడా ప్రస్తుతం ఉన్న ధరలు సూచికను దృష్టిలో ఉంచుకొని పెంచాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

# నా ఇష్టం.. ఏం చేస్తారో చేసుకోండి?

*** కిరాణా వ్యాపారి తంగుడు రమణమూర్తి జులుం * ట్రాఫిక్ నిబంధనలు పాటించని వ్యాపారిపై స్థానికులు కన్నెర్ర**



**పలాస, ఫిబ్రవరి 18 (వార్త):** ఇటీవలే కాలంలో పలాస కాశీబుగ్గ జంట పట్టణాలలో తీవ్ర ట్రాఫిక్ సమస్య ఉండటం వలన పోలీస్ అధికారులు, మున్సిపల్ అధికారులు భారీ వాహనాలను నగరంలోకి ప్రవేశించకుండా పలు ఆంక్షలు విధించారు. ట్రాఫిక్ సమస్యను దృష్టిలో పెట్టుకొని భారీ వాహనాలను రాత్రి 10 గంటల నుండి ఉదయం 6 గంటల లోపల మాత్రమే అనుమతులు అంటూ ఆదేశాలు ఉన్నప్పటికీ కొందరు వ్యాపారుల అభ్యర్థన మేరకు వారిని దృష్టిలో పెట్టుకొని రాత్రి సమయాల్లో అనుమతులు ఇచ్చారు. కానీ తంగుడు రమణమూర్తి అనే వ్యాపారి ఎస్.బి.ఎస్ స్కూల్ రోడ్డు గాంధీనగర్లో యధేచ్ఛగా భారీ వాహనాలను టైంతో సంబంధం లేకుండా, అధికారుల మాటలను పట్టించుకోకుండా పట్టపగలే రోడ్డుకు మధ్యలో పెట్టి వ్యాపార కార్యకలాపాలు సాగించుకుంటున్నారు. వీటితో ఇరుకు సందుల్లో భారీ వాహనాలు నిలిపి అన్లోడింగ్ చేయడంతో ఉదయం స్కూల్‌కి వెళ్లే పిల్లలకు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఉదయం పూట అన్‌లోడ్ చేయడంపై లారీ డ్రైవర్‌ను స్థానికులతో పాటు మీడియా ప్రతినిధులు నిలదీశారు. గొడాం యజమాని తంగుడు రమణమూర్తి వచ్చి నా ఇష్టమని, ఏంచేస్తారో చేసుకోండన్నారు. దీంతో స్థానికులు అతనిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యాపారిపై చర్యలు తీసుకోవాలని వారంతా అధికారులను కోరారు.

## కిర్రాక్ ఆర్‌పీ.. ఓ క్రాక్



**ఇచ్ఛాపురం,ఫిబ్రవరి 18 (వార్త):** కిర్రాక్ ఆర్‌పీ ఓ పెద్ద క్రాక్ అని ఇచ్ఛాపురం నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త సాడి శ్యాంప్రసాద్ రెడ్డి అన్నారు. శాసనమండలిలో ప్రతిపక్ష నాయకుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొత్స సత్యనారాయణని అతి హేయంగా అనుకరించడం తగదన్నారు. తక్షణం క్షమాపణ చెప్పాలన్నారు. బొత్స సత్యనారాయణ ఉత్తరాంధ్ర బ్రాండ్ అని, బీసీ నాయకుడన్నారు. ఎన్ని పులుసులమ్మినా వారి చిటికెన వేలికి సరిపోవని కిర్రాక్ ఆర్‌పీపై మండిపడ్డారు. వైస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్ మాట్లాడుతూ బొత్స సత్యనారాయణని ఎగతాళి చేసేంతటి వాడివా? అంటూ మండిపడ్డారు. ఉత్తరాంధ్ర మాండలికాన్ని హేళన చేస్తే ఏం జరుగుతుందో త్వరలో తెలుస్తుందన్నారు. సమావేశంలో సీనియర్ వైసిపి నాయకులు కాళ్ళ నారాయణ, కోట హరికృష్ణ, యువ నాయకులు సాలిన గాంధీ, సప్ప వంశీ, పాతిర్ల జగన్ రెడ్డి, దుర్గాశి భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

## బీమా పరిహారం పంపిణీ



**కంచిలి ఫిబ్రవరి 18(వార్త):** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రమాద బీమా పరిహారాన్ని కంచిలి మండలం పెద్ద శ్రీరాంపురం గ్రామంలో లోళ్ల శ్రావణికి మండల టిడిపి అధ్యక్షుడు మాదిన రామారావు చేతుల మీదుగా బుధవారం అందజేశారు. స్టేట్ బ్యాంకులో శ్రావణి భర్త పేరున పిఎం జేజేవై బీమా పథకంలో కొనసాగుతుంది. ఆమె భర్త లోళ్ళ గోపి ఇటీవల మృతి చెందడంతో నామిని అయిన భార్య పేరున రెండు లక్షల రూపాయల పరిహారం మంజూరు అయింది. పంపిణీ కార్యక్రమంలో టిడిపి యువ నేత మాదిన ప్రదీప్, కన్నబాబు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## చిల్లపుట్టుగ బాధితులకు పరిహారం

**కంచిలి ఫిబ్రవరి 18 (వార్త):** చిల్లపుట్టుగలో గత ఏడాది మే నెలలో జరిగిన అమ్మవారి సంబరాలు విద్యుత్ షాక్‌కు గురై ఇద్దరు పిల్లలతో పాటు మొత్తం ముగ్గురు వ్యక్తులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయా బాధిత కుటుంబాలకు ఏపీ ఈపీడీసీఎల్ అధికారులు ఐదు లక్షల రూపాయలు చొప్పున 15 లక్షల రూపాయల పరిహారం మొత్తాన్ని ఆయా బ్యాంకు ఖాతాలకు బుధవారం జమ చేసినట్లు ఇచ్ఛాపురం నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త సాడి శ్యాంప్రసాద్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సంఘటన జరిగిన మొదటి నుంచి చివరి వరకు ప్రతి సందర్భంలోనూ ఉన్నతాధికారులకు ఈ విషయంలో తాను అందించిన సమాచారాన్ని ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకొని బాధితులకు న్యాయం చేసినందుకు శ్యాం ప్రసాద్ రెడ్డి సంబంధిత అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## 89 శాతం వైకల్యం ఉన్నా.. అందని పింఛను



**ఇచ్ఛాపురం,ఫిబ్రవరి 18 (వార్త):** ఈదుపురం గ్రామం సుదమ బెహరా అనే వ్యక్తికి 89 శాతం శారీరక వైకల్యం ఉంది. ప్రభుత్వ ం కూడా ధ్రువపత్రాన్ని అందజేసింది. ఆరోగ్య పరిస్థితి కారణంగా ఉపాధి పొందలేకపోతున్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి చాలా దుర్భరంగా ఉంది. ఎన్టీఆర్ భరోసా ఫించను పథకం కింద దివ్యాంగుల పెన్షన్ మంజూరు చేయాలని సుదమ బెహరా కోరుతున్నారు.


## ఘనంగా ఎల్లమ్మ తల్లి గుడి పునప్రతిష్ట మహోత్సవం



**సంతబొమ్మాళి, ఫిబ్రవరి 18 (వార్త):** మర్రిపాడు గ్రామపంచాయతీ ఇలవేల్పు ఎల్లమ్మ తల్లి గుడి పునః ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం వేద పండితుల మంత్రాలతో, మేళతాళాలతో అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మర్రిపాడు గ్రామ పంచాయతీ సర్పంచ్, సంతబొమ్మాళి మండల మాజీ పిఏసిఎస్ అధ్యక్షులు అట్టాడ రాంప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మర్రిపాడు, చిన్న మర్రిపాడు, సెలగపేట గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అతిథి గృహం పరిశీలన

**సోంపేట ఫిబ్రవరి 18(వార్త):** బారువలోని జిల్లా పరిషత్ అతిథి గృహాన్ని బుధవారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ జడ్పీ సీఈవోతో కలిసి పరిశీలించారు. అతిథి గృహం శిథిలావస్థకు చేరుకోవడాన్ని గమనించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పాత భవనం స్థానంలో పర్యాటకులకు, సందర్శకులకు మెరుగైన వసతులు కల్పించే విధంగా నూతన భవనాన్ని నిర్మించేందుకు సన్నాహాలు చేస్తామని తెలిపారు. అతిథి గృహ ప్రాంగణానికి రక్షణగా ప్రహరీనిర్మిస్తామని, ఈ ప్రాంతాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వారి వెంట ఎంపీడీవో, సర్వేయర్, హౌసింగ్ ఏఈ, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, వీఆర్వో, ఇతర సిబ్బంది న్నారు.





## కిడ్నీ బాధితునికి ఆర్థిక సాయం

**సంతబొమ్మాళి, ఫిబ్రవరి 18 (వార్త):** నౌపడ గ్రామానికి చెందిన కిడ్నీ బాధితుడు తామాడ ప్రసాద్ అనే యువకుడు గత కొద్ది రోజుల నుండి కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. కిడ్నీలు చెడిపోవడంతో చికిత్స చేయించుకునేందుకు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. విషయం తెలుసుకున్న ప్రసాద్ ఉంటున్న పాత పోలీస్ స్టేషన్ వీధి యువకులు, మహిళలు ఆధ్వర్యంలో కిడ్నీ బాధితుడు ప్రసాద్‌కు బుధవారం రూ. ఒక లక్ష 40 వేలు ఆర్థిక సాయం అందించారు. రెండు కిడ్నీలు దెబ్బతినడంతో తక్షణ చికిత్స కోసం వీధి మహిళలు, యువకులు కలిసి గత కొద్ది రోజులుగా విరాళాలు సేకరించారు. కిడ్నీ సమస్యతో బాధపడుతున్న ప్రసాదకు వారంతా భరోసా కల్పించారు. అలాగే దాతలు ముందుకొచ్చి ప్రసాద్ కు ఆర్థిక సాయం అందించాలని వారు కోరారు. ప్రసాద్, కుటుంబ సభ్యులు పాత పోలీస్ స్టేషన్ వీధి ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాత పోలీస్ స్టేషన్ వీధి యువకులు, మహిళలు పాల్గొన్నారు.

## నాణ్యమైన రాగి ఉత్పత్తే లక్ష్యం కావాలి



**సంతబొమ్మాళి, ఫిబ్రవరి 18(వార్త):** నాణ్యమైన రాగి ఉత్పత్తే లక్ష్యం కావాలని సంతబొమ్మాళి మండల వ్యవసాయాధికారి రాళ్లపేట అప్పారావు రైతులకు పిలుపునిచ్చారు. మండలంలోని కాకరాపల్లి, చెట్లతాండ్ర గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని పలు సూచనలు చేశారు. ఆరోగ్యవంతమైన ఆహారపు అలవాట్లలో భాగంగా రాగి(చోడి) ఉత్పత్తుల వినియోగం పెరుగుతోన్న దృష్ట్యా నాణ్యమైన రాగి ఉత్పత్తి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి గొండు శ్రీధర్, వ్యవసాయ సహాయకురాలు సంపతిరావు యమున, లాభాల గణేష్, సర్పంచులు పల్లి జోగారావు పంగ అసిరినాయుడు, పల్లి రామారావు, భాస్కరరావు, కింజరాపు శంకరరావు, యళ్ల మల్లేసు, దుబ్బఅప్పారావు, పల్లి శంకరరావు, పల్లి అప్పన్న పాల్గొన్నారు.

## ఎక్సైజ్ శాఖపై డిప్యూటీ కమిషనర్ సమీక్ష



**సోంపేట ఫిబ్రవరి 18(వార్త):** సోంపేట ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో శాఖాపరమైన వివిధ అంశాలపై జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. సోంపేట ఎక్సైజ్ స్టేషన్లో గడచిన సంవత్సరంలో జరిగిన పనితీరు రికార్డును కేసుల వివరాలను పరిశీలించారు. గత సంవత్సరంలో నాటు సారా నిర్మూలనకు చేపట్టిన చర్యలను సమీక్షించారు. ఈ సంవత్సరంలో నమోదు చేయబడిన కేసులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో కేసులు నమోదు చేయబడి పరారీలో ఉన్న వారిని గూర్చి వివరాలు తెలుసుకున్నారు. వారిని వెంటనే అరెస్ట్ చేయాలని సూచించారు. వారిని కోర్టుకు హాజరు పరచాలన్నారు. సోంపేట సర్కిల్లో నాటు సారా తయారీ కేంద్రాలు గుర్తించి ముమ్మరంగా దాడులు నిర్వహించాలని కేసులు నమోదు చేయాలని సూచించారు. గతంలో నాటు సారా విక్రయాలు జరిపి పూర్తిగా విక్రయాలు నిలిపివేసిన వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ఎక్సైజ్ సర్కిల్లో గల వివిధ మండలాల్లో అవసరమైనచోట్ల చెక్పోస్టులు ఏర్పాటు చేయాలన్నారు. ఎక్సైజ్ సీఐ జివి రమణ, ఎస్ఐలు జగన్నాథ్, ప్రసాద్, సిబ్బంది మార్కారావు భాను, అరుణ్, ఉమాపతి, గుణాకర్ తదితరులు పాల్గొన్నారు.




## ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు సహకరించాలి

**మందస, ఫిబ్రవరి 18(వార్త):** ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు సహకరించాలని మందస మండలం మండల విద్యాశాఖ అధికారి మర్రిపాటి లక్ష్మణరావు పిలుపునిచ్చారు. మందస మండలంలోని పొత్తంగి-సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దాతలు సహాయంతో నిర్మించిన స్టోర్ రూమ్ ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1974 నుండి సుమారుగా నాలుగు దపాలుగా ప్రధానోపాధ్యాయుడిగా పని చేసిన రాజారావు సొంత నిధులు 70వేల రూపాయలు ఆర్థిక సహాయం చేశారన్నారు. అదేవిధంగా ఎస్ఎంసీ సభ్యులు, పాఠశాల సిబ్బంది సుమారుగా లక్షా 50 వేల రూపాయలు ఖర్చుతో పాఠశాలలో స్టోర్ రూమ్ నిర్మాణం చేశారన్నారు. ఈ స్టోర్ రూమ్ విద్యార్థులకు ఎంతో ఉపయోగం ఉంటుందని, దాతలను కొనియాడారు.

## కొత్తపల్లి జెడ్పీహెచ్ పాఠశాలకు ప్రింటర్ వితరణ



**మందస, ఫిబ్రవరి 18(వార్త):** మందస మండలంలోని కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలుగా పనిచేసిన నగిరి లీలారాణి, జగదీశ్వరరావు దంపతులు పాఠశాలకు రూ.17,500లు విలువ చేసే ఒక ప్రింటర్ ను ప్రధానోపాధ్యాయుడు కూన వేణుగోపాలరావుకు అందజేశారు. పాఠశాలకు, విద్యార్థులకు సంబంధించి పలు అవసరాల దృష్ట్యా ఈ ప్రింటర్ ని పాఠశాలకు అందజేసి, పాఠశాల అభివృద్ధికి సహకరించిన దంపతులకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, సిబ్బంది, విద్యార్థులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసారు. దాతలు మాట్లాడుతూ భవిష్యత్ లో కూడా పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకరిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గవ్వ భీమారావు, ఎం.లక్ష్మణరావు, ఎ.అప్పారావు, బి.పాపమ్మ, ఎం.చిత్రసేను, జి. సూర్యనారాయణ, జి.చినికృష్ణ, ఎం.దామోదరం, బి.రమేష్, పి.అఖిల తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ బడ్జెట్ ఆమోదం

**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి18 (వార్త):** పురపాలక సంఘం2025-2026 సంవత్సరపు సవరణ బడ్జెట్, 2026 -2027 సంవత్సరపు అంచనా బడ్జెట్ లను స్వల్ప చర్చతో మున్సిపల్ కౌన్సిల్ ఆమోదించింది. మున్సిపల్ చైర్ పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అధ్యక్షతన సమావేశం జరిగింది. కమిషనర్ రమేష్ 2025-2026 సంవత్సరపు సవరణ బడ్జెట్‌ను 2025-26 సంవత్సరపు వార్షిక అకౌంటులోని అంత్య నిల్వ రూ.2320.92 లక్షలు ఆధారముగా తీసుకొని 2025-2026 సంవత్సరమునకు సాధారణ, మూలధన రాబడి రూ.1970.54 లక్షలుగా అంచనా వేయబడి ప్రారంభ నిల్వతో మొత్తం రాబడి రూ.4050.92 లక్షలు గాను సాధారణ మూలధన నిధుల అంచనా ఖర్చు రూ.1774.00 లక్షలుగా చూపించి రూ.2320.92 లక్షలు మిగులు బడ్జెట్ సమర్పించారు. 2025-2026 సంవత్సము నకు సాధారణ మరియు మూలధన అంత్య నిల్వ రూ.2320.92 లక్షలుతో ముగిసిన మొత్తం 2026-2027 సంవత్సరపు బడ్జెట్ ప్రారంభ నిల్వగా చూపబడి 2026-2027 సంవత్సరం నకు బడ్జెట్ అంచనాకు అన్ని ఖాతా పద్దులు క్రింద సాధారణ మరియు మూలాధనముల రాబడి రూ.2187.77 లక్షలు మరియు సాధారణ మరియు మూలధన ఖర్చు మొత్తం రూ.1905.02లక్షలు చూపగా ముగింపు నిల్వ రూ. 2675.87లక్షలుగా వచ్చునని తెలిపారు. వైస్ చైర్ పర్సన్ లాభాల స్వర్ణ మణి బడ్జెట్ అంకెలపై అధికారులను తప్పు పట్టారు. కరెంట్, టెలిఫోన్, మైక్ చార్జీలపై 9వ వార్డు కౌన్సిలర్ బచ్చు జగన్ నిలదీశారు. అనంతరం బడ్జెట్‌ను ఆమోదించారు.





## గ్యాస్ సిలెండర్లు పంపిణీ

**ఇచ్ఛాపురం,ఫిబ్రవరి 18 (వార్త):** మున్సిపాలిటీ పరిధి 17వ వార్డు సంతపేటలో ముగ్గురికి ఉజ్వల గ్యాస్ సిలెండర్లు పంపిణీ చేశారు. ఓడ అశ్విని, బంటుపల్లి ఢిల్లీశ్వరి, కరగాన గౌతమీలకు వార్డు తెలుగుదేశం పార్టీ ఇన్ ఛార్జ్ జన్నెల సంతోష్ యాదవ్ అందజేశారు.

## యారబాడులో రామాలయ మందిరం ప్రారంభం



**నరసన్నపేట, ఫిబ్రవరి 18(వార్త):** యారబాడు గ్రామంలో రామాలయ మందిర ప్రతిష్ఠ మహోత్సవం భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహిస్తున్నారు. మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావుతో పాటు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ నేటి కాలంలో ప్రతి గ్రామంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు పెరుగుతున్నాయని, ఇది సమాజానికి ఎంతో శుభసూచకమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ధార్మిక చైతన్యం పెరగడం ద్వారా సాంప్రదాయ విలువలు, సనాతన సంస్కృతి మరింత బలపడుతుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమం అనంతరం అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించారు.

## డంపింగ్ యార్డ్ వద్ద స్థానికుల ఆందోళన



**నరసన్నపేట, ఫిబ్రవరి 18(వార్త):** నరసన్నపేట డంపింగ్ యార్డ్ సమస్యపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డ్‌కు చెత్త తరలిస్తున్న ట్రాక్టర్లను బుధవారం గ్రామస్థులు అడ్డుకున్నారు. డంపింగ్ యార్డ్‌లో చెత్తకు నిప్పు పెట్టడం వల్ల వస్తున్న పొగతో పెద్దపేట, జగన్నాథపురం ప్రాంతాల్లో తీవ్ర కాలుష్య పరిస్థితులు నెలకొంటున్నాయన్నారు. ఈ కాలుష్యం కారణంగా ప్రజలు క్యాన్సర్, ఊపిరితిత్తుల వ్యాధులు వంటి ఆరోగ్య సమస్యలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను పలుమార్లు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు తెలిపారు. మండల, జిల్లా స్థాయి అధికారులు వెంటనే స్పందించి డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

## కోడూరులో అన్యమత ప్రచారం



**పోలాకి, ఫిబ్రవరి 18(వార్త):** కోడూరు పంచాయతీ పరిధిలో అన్యమత ప్రచారం నిర్వహిస్తున్న వ్యక్తులను గ్రామస్థులు అడ్డుకున్నారు. హిందువులు అధికంగా నివసించే ప్రాంతాల్లో సంచారం చేస్తూ 'క్రీస్తు సువార్త' పేరిట కరపత్రాలు పంపిణీ చేయడాన్ని స్థానికులు గుర్తించి విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ సభ్యుల దృష్టికి తీసుకువెళ్లారు. వారు వచ్చి అన్యమత ప్రచారం చేస్తున్న వారిని నిలదీశారు. గ్రామంలో మతప్రచారాలు నిర్వహించడం తగదన్నారు. భవిష్యత్తులో ఇలాంటి చర్యలు కొనసాగితే పోలీసులకు ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## డ్రోన్లు, సీసీ కెమెరాలతో నిఘా



**జలుమూరు, ఫిబ్రవరి 18(వార్త):** శ్రీముఖలింగంలో నిర్వహిస్తున్న శ్రీముఖలింగేశ్వర స్వామి చక్రతీర్థ స్నానాల సందర్భంగా పోలీసులు విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. భక్తుల రాకపోకలను సమగ్రంగా పర్యవేక్షించేందుకు మొత్తం 8 డ్రోన్ కెమెరాలను వినియోగించారు. శ్రీముఖలింగం వైపు 6, మిరియపల్లి వైపు 2 డ్రోన్ల ద్వారా భక్తులతో పాటు వారు వచ్చే మార్గాలను జల్లెడ పట్టారు. అలాగే శ్రీముఖలింగం నుంచి వంశధార నది వరకు 57 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిరంతర నిఘా కొనసాగిస్తున్నారు. అదనంగా మరికొన్ని ప్రాంతాల్లో కెమెరాలు అమర్చడంతో మొత్తం సుమారు 100 సీసీ కెమెరాల ద్వారా ఏర్పాటు చేశారు. అడిషనల్ ఎస్పీ కేవీ రమణ నేతృత్వంలో సుమారు 892 మంది పోలీసులతో భారీ భద్రతను ఏర్పాటు చేశారు. ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి కెమెరాల ద్వారా వచ్చే దృశ్యాలను క్షణక్షణం పరిశీలిస్తున్నారు. జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి స్వయంగా సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలను పరిశీలించారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## డీవార్మింగ్ మాత్రల పంపిణీ



**ఇచ్ఛాపురం,ఫిబ్రవరి 18 (వార్త):** స్థానిక జ్ఞాన భారతి పాఠశాలలో విద్యార్థుల్లో నులిపురుగుల నివారణ కోసం డి వార్మింగ్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని పాఠశాల కార్యదర్శి, ముఖ్య కార్యనిర్వహణాధికారి జోహార్ ఖాన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రభుత్వ వైద్య సిబ్బంది పర్యవేక్షణలో జోహార్ ఖాన్ 900 మంది విద్యార్థులకు మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ ఆరోగ్యం పట్ల పూర్తి శ్రద్ధ వహించాలని, ఆరోగ్యానికి హాని కలిగించే ఆహార పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ట్రస్టి వజ్రపు రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఇందు భూషణ్ పండా, హెడ్ మిస్ట్రెస్ రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



### స్వామి వారి చక్రతీర్ధ స్నానానికి..

# పోటెత్తిన భక్తులు





















Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546